నమస్తే తెలంగాణ



## సందర్శించి..ఆరా తీసి..



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 20: ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో గల కుమ్రం భీం ప్రాజెక్టుకి వరద పోటెత్తుతున్నది. దీంతో ప్రాజెక్ట్ ను ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తో కలిసి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్ సామర్థ్యం, ప్రస్తుత నీటి నిలువ గేట్ల ఎత్తివేత పలు అంశాలపై ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గేట్ల ఎత్తివేత, తదితర సమాచారాన్ని ఎల్లవేళలా దిగువ ప్రాంత ప్రజలకు తెలియజేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇక్కడ ఆసిఫాబాద్, వాంకిడి సీఐలు సతీశ్, శ్రీనివాస్,ఎస్ఐ గంగన్న తదితరులు ఉన్నారు.

## తల్లడిల్లిన కన్నపేగు..

- కొడుకుకు తల కొరివి పెట్టిన తల్లి



కన్న కొడుకుకు అగ్గి పడుతున్న తల్లి

నెన్నెల, జూలై 20 : నవ మాసాలు మోసి ప్రేమతో చేతులారా పెంచిన కన్నకొడుకుకు తల్లే తల కొరివి పెట్టిన విషాద ఘటన నెన్నెల మండలం ఘన్‌పూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఘన్‌పూర్‌కు చెందిన పోలంపల్లి మల్లేశ్ (28) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నారు. మల్లేశ్‌కు భార్య సంధ్య, తల్లి పోషక్క మాత్రమే ఉన్నారు. తండ్రి చిన్నప్పుడే మృతి చెందాడు. మల్లేశ్‌కు పిల్లలు కూడా లేక పోవడంతో భార్య తలకొరివి పెట్టవద్దని, కన్న తల్లే తల కొరివి పెట్టాలని కుల పెద్దలు, బంధువులు నిశ్చయించారు. 'అయ్యో కొడుకా నాకు తలకొరివి పెడ్తవనుకున్న..నీకు తలకొరివి పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది భగవంతుడా' అని గుండెలు బాదుకుంటూ తల్లి రోదించింది. ఆ తల్లిని చూసి బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : డీఈవో అశోక్



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి అశోక్

కెరమెరి, జూలై 20: ప్రభుత్వ విద్య సంస్థలో చదువుతున్న విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యంపై అంతే శ్రద్ధ చూపాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులు, తరగతి గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు కష్టపడి చదివి విద్య, ఉద్యోగావకాశాలు సాధించాలని, తల్లిదండ్రులు, విద్యాసంస్థకు మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు గుణాత్మకమైన, మెరుగైన విద్య అందిస్తూ, మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి మీనా, సిబ్బంది ఉన్నారు.

**పర్యావరణ స్పృహను కలిగి ఉండాలి**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 20 : విద్యార్థులు పర్యావరణ స్పృహను కలిగి ఉండాలని డీఈవో పార్శి అశోక్ అన్నారు. జిల్లాలోని ఎన్నికైన పలు పాఠశాల విద్యార్థులకు జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ ట్యూబ్ లైట్ తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం డీఈవో ప్రారంభించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత దళ రీజనల్ కో ఆర్డినేటర్ విద్యాసాగర్ , జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ తదితరులు ఉన్నారు.

## మెనూ ప్రకారం పోషకాహారం అందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 20: వసతి గృహాల్లో విద్యార్థినులకు సకాలంలో మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. శనివారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసి వసతి గృహ ఆవరణ, విద్యార్థులు గదులు, పరిసరాలు, మూత్రశాలలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఉదయం వేళ అందించే అల్పాహారంపై విద్యార్థినులను వివరాలు అడుగగా ఇడ్లీ, పులిహోర, టమాటా రైస్ ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థిని సరిపడా స్నానపు గదులు, మూత్రశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. వసతి గృహం ఆవరణ, పరిసరాలు, మూత్రశాలలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని, విద్యార్థులు వంటలలో తాజా సరుకులు, కూరగాయలనే వినియోగించాలని, కాల పరిమితి ముగిసిన వస్తువులను ఉపయోగించవద్దని తెలిపారు. వర్షాల దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి పథకంతో ఆర్థిక చేయూత

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 20: ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొన్ని యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు క్యాంటీన్‌తో పాటు స్త్రీ నిధి లింకేజ్, బ్యాంకు లింకేజ్, వాటర్ షెడ్‌ల ద్వారా నిధులు సమకూర్చి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ తిరుపతి, ఏపీఎం సుజాత, శ్రీనివాస్, ఎంపీవో శివకుమార్, మండల సమాఖ్య సీసీలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ దవాఖాన తనిఖీ..**

జైనూర్ జూలై, 20 : జైనూర్ మండలంలో ప్రభుత్వ దవాఖాననను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు సౌకర్యాలు లేని గ్రామాల్లో గర్భిణులను ముందస్తుగా దవాఖానలో చేర్పించి వైద్యం అందించాలని డాక్టర్లను సూచించారు. పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. హరిజనవాడలోని అంగనవాడీ కేంద్రాన్ని పరిశీలించారు. నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని పాఠశాల సిబ్బంది వాడుకుంటున్నారని ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా తెలిపారు. సోమవారం నుంచి భవనం అంగనవాడీ కేంద్రానికి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి. మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న 22 యూనిట్లను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా విజయ డెయిరీ పాల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణకు సూచించారు. స్కూల్ యూనిఫామ్‌ల స్టిచ్చింగ్‌పై మహిళల పనీతీరును అభినందించారు. మండల కేంద్రంలో మహిళా శక్తి ఆధ్వర్యంలో స్టిచ్చింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. మీసేవ కేంద్రాలు కూడా ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. శ్రీనిధి లింకేజ్ ,బ్యాంకు లింకేజ్, వాటర్‌షేడ్ ఫండ్స్‌ను వాడుకొని మరిన్ని కార్యక్రమాలు ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించాలని ఏపీఎం సుజాతను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు కూడా వినియోగించుకోవాలని సూచించారు. మహిళా శక్తి ఆధ్వర్యంలో సర్కారు దవాఖాన ముందు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సూచించారు. జైనూర్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏఫ్‌పీసీ గోదాం ఏర్పాటుకు రూ.25 లక్షలు కేటాయించాలని సూచించారు. వ్యవసాయం కోసం త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించాలని మహిళా సంఘాలు అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీని కోరగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, అడిషనల్ డీఎం హెచ్‌వో తుకారాం భట్, డా. అశోక్, డీసీహెచ్ చెన్న కేశవ్‌రావ్, పీహెచ్ఎన్ రత్నకుమారి,హెచ్ఈవో దిలీప్ , ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, తహసీల్దార్ తిరుపతి, ఎంపీవో శివకుమార్, ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా, సూపర్‌వైజర్ పెంటుబాయి, ఐకేపీ ఏపీఎం సుజాత, సీసీలు మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.



సర్కారు దవాఖానను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

## కేజీబీవీ విద్యార్థినులకు వసతులు కల్పించాలి

- కోటపల్లి మండల ప్రత్యేకాధికారి వినోద్

కోటపల్లి, జూలై 20 : కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, అధికారులను మండల ప్రత్యేకాధికారి వినోద్ సూచించారు. కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని స్పెషల్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. నీటి సమస్య త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారిణి హరితకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఆఫీసర్ వెంట మండల పంచాయతీ అధికారి ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

## ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన ముగ్గురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్



నిందితులను చూపుతున్న పోలీసులు

మంచిర్యాల అర్బన్, జూలై 20 : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, ఆయన అనుచరుడు జగన్మోహన్ రావుపై ఆరోపణలు చేసిన కేసుతో పాటు, మరో రెండు కేసులకు సంబంధించి మంచిర్యాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, బీజేపీ జిల్లా కార్యదర్శి రజనీష్ జైన్, పాత మంచిర్యాలకు చెందిన కొల్లూరి భాస్కర్, నస్పూర్‌కు చెందిన పెరకొంట్ల సంపత్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఏసీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆర్ ప్రకాశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, ఆయన అనుచరుడు జగన్‌మోహన్ రావుకు వ్యతిరేకంగా గుర్తు తెలియని వ్యక్తి లెటర్ రాసి, దాని జిరాక్స్‌ను ఈ నెల 2న మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పంచిపెట్టారు. ఈ మేరకు 7వ తేదీన ఎమ్మెల్యే అనుచరుడు మంథని జగన్‌మోహన్‌రావు మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, పత్రాలు పంపిణీ చేసింది మంచిర్యాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, బీజేపీ జిల్లా కార్యదర్శి రజనీష్ జైన్‌గా గుర్తించారు. శనివారం తన ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి బైక్, మొబైల్ ఫోన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సహకరించిన పాతమంచిర్యాలకు చెందిన కొల్లూరి భాస్కర్, నస్పూర్‌కు చెందిన పెరకొంట్ల సంపత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మధ్య కాలంలో రజనీశ్ జైన్, కొల్లూరి భాస్కర్‌పై మరో రెండు భూకబ్జా కేసులు కూడా నమోదయ్యాయని డీసీపీ వెల్లడించారు. ముగ్గురినీ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల సీఐ బన్సీలాల్, ఎస్ఐ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ టెలికాం మెటీరియల్ చోరీ

రెబ్బెన, జూలై 20: రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామ శివారులో బీఎస్ఎన్ఎల్ టెలికాం టవర్ నిర్మాణం కోసం ఉంచిన మెటీరియల్‌ను చోరీకి గురైందని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామ శివారులో బీఎస్ఎన్ఎల్ టెలికాం టవర్ నిర్మాణం కోసం గతేడాది రూ.8.84 లక్షల విలువైన 10.159 టన్నుల మెటీరియల్ పంపించారు. శనివారం రూ.6.30 లక్షల విలువైన 7.3 టన్నుల మెటీరియల్ ఎత్తుకెళ్లినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఏరియా మేనేజర్ షేక్ అబ్దుల్ ఖాదర్ ఫిర్యారు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## కేకే ఓసీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మందమర్రి, జూలై 20 : ఎడతెరపి లేని వర్షాల కారణంగా సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ తొలగింపు పనులు నిలిచిపోయాయి. శనివారం వర్షాల కారణంగా 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా 60 వేల టన్నుల ఓబీ తొలగింపు పనులు నిలిచిపోయినట్లు ఓసీ ప్రాజెక్టు అధికారి రమేశ్ తెలిపారు. గత మూడు రోజుల్లో వర్షాల కారణంగా 18 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లడంతో పాటు 1.80 లక్షల టన్నుల ఓబీ పనులు నిలిచిపోయాయని చెప్పారు.

